దాహార్తి తీరుస్తూ..!

● 20ఏళ్లుగా చల్లనినీరు ప్రజలకు, ప్రయాణికులకు పంపిణీ ● అమ్‌సబ్‌ఏక్ హై సొసైటీ సేవకు ప్రశంసల వెల్లువ

ముషీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వారంతా కార్మికులే కానీ సామాజిక బాధ్యతతో ప్రజలకు తమ వంతు సహాయ సహకారాలు అందించాలనే లక్ష్యంతో భోలక్‌పూర్‌కు చెందిన కార్మికులు అమ్ సబ్ ఏక్ హై సొసైటీని ఏర్పాటు చేసుకున్నారు. 20 సంవత్సరాలుగా వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

ముషీరాబాద్‌లో చలివేంద్రం..

ముషీరాబాద్ ప్రధాన రోడ్డులోని ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కన అమ్ సబ్ ఏక్ హై సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సొసైటీ నిర్వాహకులంతా కార్మికులు, ప్లాస్టిక్, ఐరన్, స్క్రాబ్ కొనుగోలు చేసే చిరువ్యాపారులు. వీరంతా డబ్బులు వేసుకుని చలివేంద్రం ఏర్పాటు చేసి మండుటెండలకు అల్లాడిపోతున్న ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు. 20 ఏళ్ళుగా ముషీరాబాద్‌లో ప్రతి వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేసి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రతిరోజూ వందలాది మందికి మంచినీటిని అందిస్తూ ప్రజల దీవెనలను పొందుతున్నారు.

చలివేంద్రం వద్ద ఆగుతున్న ఆర్టీ బస్సులు..

మండుతున్న ఎండలకు బెంబేలు ఎత్తిపోతున్న ప్రజలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు సొసైటీ నిర్వాహకులు బస్సును ఆపి డ్రైవరు, ప్రయాణి కులకు మంచినీటిని అందజేస్తున్నారు. బస్సు డ్రైవర్లు సైతం చలివేంద్రం వద్ద తమ బస్సులను ఆపడంతో సొసైటీ నిర్వాహకులు



ఆర్టీసీ బస్సులో తాగునీటిని అందజేస్తున్న నిర్వాహకుడు

ట్రేలలో గ్లాసులను పెట్టుకుని ప్రయాణికుల వద్దకెళ్లి చల్లని నీటిని అందజేస్తున్నారు. పాదచారులు, వాహనదాలు సైతం తమ వాహనాలను నిలిపి మంచినీటిని తాగి వెళ్తున్నారు.

జలమండలి అధికారులు సైతం..

ముషీరాబాద్‌లోని జలమండలి అధికారులు సైతం అమ్ సబ్ ఏక్ హై సొసైటీ సభ్యులు చేస్తున్న సేవలను అభినందిస్తూ వాటర్ ట్యాంక్ ద్వారా చలివేంద్రానికి నీటి సరఫరా చేస్తున్నారు. భారీ రంజన్ కుండలు, వాటర్ ట్యాంక్‌లలో నీటిని నింపి తమ బాధ్యతను నెరవేర్చుతున్నారు. ఒక్కొక్క సారి రెండుసార్లు సైతం తాగునీటిని ట్యాంక్‌ల ద్వారా పంపించిన సందర్భాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.



ముషీరాబాద్‌లో పాదచారులకు తాగునీటిని అందిస్తున్న అమ్ సబ్ ఏక్ హై సొసైటీ సభ్యులు

చల్లటి నీటిని అందిస్తున్నాం



ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం రంజన్ కుండలు ఏర్పాటు చేసి, చల్లనినీటిని అందిస్తున్నారు. మండిపోతున్న ఎండలకు దాహార్తిని తీర్చుతున్నారు. ప్రయాణికులు, పాదచారులు చలివేంద్రం వద్ద ఆగి మంచినీటిని తాగి సొసైటీ సభ్యులను అభినందిస్తున్నారు.

- బల్లా ప్రశాంత్, వాహనదారుడు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్న కార్పొరేటర్



ఓటుహక్కు వినియోగించుకున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుధవారం గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు చట్టసవరణ బిల్లు ఆమోదించడంపై విషాన్ని చిమ్ముతున్న మజ్లిస్ పార్టీని ఓడించి, ఆ రజాకార్ పార్టీకి కొమ్ముకాస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఓటు హక్కును వినియోగించుకునే ప్రజాప్రతినిధులను కోరారు.

డ్రైనేజీ పనులు పూర్తిచేయాలి: కార్పొరేటర్

ముషీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ హజార్ గల్లీలో కొనసాగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ అన్నారు. బుధవారం హజార్‌గల్లీలో జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... మంచినీటి సమస్యను సైతం వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచిముదిరాజ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్ కుమార్, నాయకులు వెంకటేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి : బీఆర్ఎస్

ముషీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు పార్టీనాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆ పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహా కోరారు. బుధవారం ముషీరాబాద్ నుంచి బీఆర్ఎస్ నాయకులతో కలిసి వరంగల్‌లో జరిగే బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించి, కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా జైసింహా మాట్లాడుతూ.... ముషీరాబాద్ నియోజకవర్గంలో వాల్ రైటింగ్, ఫ్లెక్సీబోర్డులు, గులాబీ తోరణాలను పెద్దఎత్తున ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, నాయకులు బల్వంత్, శ్రీకాంత్ యాదవ్, బాబు, సాయిచాణిక్యరెడ్డి, అనిల్ తదితరులు తరలివెళ్లారు.

విరామ బైబిల్ పాఠశాల తరగతులు షురూ

చిక్కడపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో విరామ బైబిల్ పాఠశాల తరగతులు ప్రారంభమయ్యాయి. వేసవిలో పన్నెండు రోజులపాటు కేజీనుంచి పీజీ చదివే పిల్లలు, యువతీయువకులకు టీచర్లు, పాస్టర్లు ఈ తరగతులు నిర్వహిస్తారు. ఈ తరగతులకు జంటనగరాల నుంచి దాదాపు 500 మంది హాజరయ్యారు. పలు మాధ్యమాల ద్వారా వివిధ బోధనోపకరణాలు ఉపయోగించి బైబిలు కథలు, పాటలు, హ్యాండ్‌వర్క్స్ మొదలగు వాటితో శిక్షణ ఇస్తున్నట్లు చర్చి నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న నిర్విరామ సుశీల గానవిభావరి



కావ్యారెడ్డిని సత్కరిస్తున్న సినీనటుడు సుమన్, వంశీ రామరాజు

చిక్కడపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కావ్యారెడ్డి మ్యూజికల్ వరల్డ్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో సుమధుర స్వరాభిషేకం పేరిట నిర్వహించిన సినీసంగీత విభావరి ఆకట్టుకుంది. 12 గంటలపాటు గానకోకిల పి.సుశీల ఆలపించిన పాటలను నిర్విరామంగా గానం చేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో వంశీ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు డా.వంశీ రామరాజు వంశీ గ్లోబల్ మ్యూజిక్ అవార్డును ప్రముఖ సినీనటుడు సుమన్ గాయని కావ్యారెడ్డికి బహూకరించి, సత్కరించారు. బింగి నరేందర్‌గౌడ్, వెంకటాచారి, రమేష్, సైదారెడ్డి, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న 951వ ర్యాంకర్ సౌమ్య

సివిల్స్ ఆశావహులకు స్ఫూర్తిగా సౌమ్య

చిక్కడపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఆశావహులకు ఐఐటీ గౌహతి పూర్వ విద్యార్థిని సౌమ్య స్ఫూర్తిగా నిలిచారు. తిరుపతికి చెందిన సౌమ్య ఆరో తరగతి నుంచి హైదరాబాద్‌లోనే నివాసం ఉంటుంది. ఆమె తల్లిదండ్రులు ఇద్దరూ హైదరాబాద్‌లోనే ఉద్యోగులుగా ఉన్నారు. మంగళవారం విడుదలైన సివిల్స్ ఫలితాల్లో సౌమ్య 951వ ర్యాంక్ సాధించి తనదైన ముద్ర ప్రదర్శించారు. గౌహతి ఐఐటీలో బీటెక్ పూర్తిచేసిన సౌమ్య హైదరాబాద్ విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో సివిల్స్‌కు కోచింగ్ తీసుకున్నారు. ప్రస్తుతం ఆమె అదే కోచింగ్ సెంటర్‌లో ఫ్యాకల్టీగా పనిచేస్తోంది. ఈ సందర్భంగా ఆమె బుధవారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని హైదరాబాద్ విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవిశ్రాంత అంకితభావం, మేధోపరమైన జ్ఞానం స్థిరమైన కృషితో సివిల్స్ సాధించడం సులభమవుతుందని అన్నారు.

రైలులో మంగళసూత్రం చోరీ

బర్కత్‌పుర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికురాలి మంగళ సూత్రాన్ని దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నంకు చెందిన బి.అప్పలరాజు నాగర్‌సోల్‌లో అజంత ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి కాచిగూడకు కుటుంబ సభ్యులతో కలిసి వస్తున్నాడు. మహారాష్ట్రలోని మాట్కేర్ రైల్వే స్టేషన్ సమీపంలో సీటు కింద పెట్టిన బ్యాగు కనిపించలేదు. ఆందోళన చెందిన అప్పలరాజు వివిధ బోగీలలో వెతకడంతో ఎస్5లో బ్యాగు కనిపించింది. దానిలో ఉన్న 10 గ్రాముల బంగారు మంగళసూత్రం కనిపించలేదు. కాచిగూడ వచ్చిన తర్వాత రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తూ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పుగూడ-యాకత్‌పుర రైల్వే స్టేషన్ల మధ్య 50 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



చిక్కడపల్లి,ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ క్రాస్‌రోడ్ మెట్రోస్టేషన్ ఫుట్‌పాత్‌పై 35నుంచి 40 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మంగళవారం సాయంత్రం అపస్మారక స్థితిలో పడి ఉన్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. 108 సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి అప్పటికే ఆ వ్యక్తి చనిపోయినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎస్ఐ మౌనిక కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నర్సయ్య తదితరులు



ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ సుధాకర్ తదితరులు

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి దారుణం

ముషీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు ఎం.నర్సయ్య తీవ్రంగా ఖండించారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కశ్మీర్‌లో దాడి చేసిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. టూరిస్టులకు రక్షణ కల్పించి స్వస్థలాలకు వెంటనే చేర్చాలని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రాంచందర్, వర్కింగ్ ప్రసిడెంట్ మహ్మద్ అబ్దుల్, నాయకులు ఇస్మాయిల్, సురేష్ కుమార్, హనుమంతుగౌడ్, బాషా, రసూల్, మాణిక్యం, భాస్కర్, గోవింద్‌సింగ్ పాల్గొన్నారు.

అత్యంత హేయమైన చర్య

కవాడిగూడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం అత్యంత హేయమైనచర్య అని దీనిని దేశ ప్రజలంతా రాజకీయాలకతీతంగా ముక్తకంఠంతో ఖండించాలని దోమలగూడ అడ్వకేట్‌కాలనీ బాల త్రిపుర సుందరీదేవి ఆలయ చైర్మన్, దోమలగూడ మాజీ కార్పొరేటర్ టి రవీందర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీందర్ భక్తులతో కలిసి మాట్లాడారు. కశ్మీర్‌లో దాడికికారణమైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాన్నారు. ఈ సమావేశంలో బీజేపీ ఓబీసీ మోర్చారాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ శ్రీనివాస్ ముదిరాజ్, బీజేపీ నాయకులు శివరాజ్,ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ రవీందర్ తదితరులు

ఉగ్రదాడిని ఖండిస్తున్నాం: ఐఎంఏ తెలంగాణ

నల్లకుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం సమీపంలో బైసరాన్ మైదానం వద్ద జరిగిన ఘోర ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఈ దాడిలో 26 మంది అమాయక ప్రజలు మృతి చెందడం విషాదకరమన్నారు. బుధవారం నగరంలో సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె.అశోక్‌రెడ్డి, ఫైనాన్స్ కార్యదర్శి డాక్టర్ టి.దయాల్‌సింగ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఆయుధం లేని పౌరులపై ఇలాంటి అమానుష దాడి, శాంతి, మానవత్వం, జాతీయ ఐక్యతపై నేరుగా జరిగిన దాడిగా ప్రభుత్వం పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. బాధితుల కుటుంబాలకు మద్దతుగా ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర శాఖ తమ సంఘీభావం తెలియజేస్తుందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు.

పహల్గాం దాడిని ఖండిస్తున్నాం : ఆప్

కవాడిగూడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలోని బైసరన్‌లో పర్యాటకులను లక్ష్యంగా జరిగిన భయంకరమైన ఉగ్రదాడిని ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు జరగడానికి కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆయన ఆరోపించారు. బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ పహల్గామ్ విధ్వంసర ఉగ్రవాద దాడిని ఖండిస్తూ నిరసన ప్రదర్శనలు దేశవ్యాప్తంగా నిర్వహించారు. దీంతో ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్ శ్రేణులు కొవ్వొత్తులు వెలిగించి పహల్గామ్ ఉగ్రదాడి మృతులకు నివాళులర్పించి ఉగ్రవాదం నశించాలి, శాంతిని కాపాడాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జావీద్ షరీఫ్, సుధారాణి, డాక్టర్ లక్ష్మనాయుడు, కొడంగల్ శ్రీనివాస్, మౌనిక, షాబాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మెడ్జీ కళాశాల హవా



విద్యార్థులను అభినందిస్తున్న మెడ్జీ కళాశాల డైరెక్టర్, అధ్యాపకులు

హైదరాబాద్‌సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో నారాయణగూడలోని మెడ్జీ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఫస్టియర్ ఎంపీసీ విభాగంలో తేజస్వి 466/470, పి.గాయత్రి 459/470, ప్రియాంశుతివారీ 457/470 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో, శ్రీవల్లి, నందిని 429/440 చొప్పున, ఎంఈసీలో డి.మమత 482/500, సీఈసీలో దీక్షితకు 476/500 లభించాయి. ఈ సందర్భంగా మెడ్జీ జూనియర్ కాలేజీ డైరెక్టర్ సాయికిషోర్ మాట్లాడుతూ.. తమ విద్యార్థులు అన్ని విభాగాల్లోనూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని, వారంతా రాష్ట్ర స్థాయి ర్యాంపేజ్‌ను సాధించడంలో అధ్యాపక సిబ్బంది, ప్రణాళికాబద్ధమైన శిక్షణ ఉందన్నారు. భవిష్యత్‌లో జాతీయస్థాయి పరీక్షల్లోనూ మరిన్ని విజయాలను సాధించాలనే ఆశయంతో సంస్థని నడిపిస్తున్నామన్నారు. అత్యుత్తమ మార్కుల విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ గణేష్, డీన్ లక్ష్మి, ప్రిన్సిపాల్ భగవాన్, వైస్‌ప్రిన్సిపాల్ వెంకట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రజనీకాంత్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

'గ్రామ బహిష్కరణపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

నల్లకుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్రంలోని పిఠాపురం నియోజకవర్గం మల్లం గ్రామంలో దళితుల గ్రామ బహిష్కరణకు పాల్పడిన అగ్రకులాలపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు డిమాండ్ చేశారు. దళితుల గ్రామ బహిష్కరణపై మానవ హక్కుల, జాతీయ ఎస్సీ కమిషన్లకు ఫిర్యాదు చేయనున్నామన్నారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేషనల్ అంబేడ్కర్ సేన తెలంగాణ రాష్ట్ర తాలుకా రాజేష్, జైభీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు పి.బల్వంత్‌రావు, అంబేడ్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోకుల్ కల్యాణ్‌రావు, ప్రధానకార్యదర్శి కాత్రి ప్రవీణ్‌కుమార్, మాల సంఘం నాయకుడు గిరి, మలక్‌పేటమాల సంఘం అధ్యక్షుడు ముప్పిడి బల్వంత్‌రావు, ఎమ్మార్పీఎస్ నేత కరుణాకర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. దళితుల బహిష్కరణపై ఇప్పటివరకు అక్కడి పాలకులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు.

ఆదివాసీలకు జీవించే హక్కును పునరుద్ధరించాలి

- పౌరహక్కుల సంఘం, ప్రజాసంఘాలు

కవాడిగూడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేసి, ఆదివాసీలకు జీవించే హక్కును పునరుద్ధరించాలని పౌరహక్కుల సంఘం, ప్రజాసంఘాలు డింఆండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద పౌర హక్కుల సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ, చత్తీస్‌ఘడ్ ఉసూరు కర్రెగుట్టలో పదివేల మంది పోలీసు బలగాలు చుట్టుముట్టి జరుపుతున్న కాల్పులను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివాసీల జీవించే హక్కును కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పకైనా కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీ నేతలతో చర్చలు జరిపి చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు చర్యలుచేపట్టాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణరావుతో పాటు పౌర హక్కుల సంఘం నాయకులు, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.



ఆదివాసీలపై కాల్పులకు నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు



అందాల పోటీలను రద్దు చేయాలని నినదిస్తున్న పలువురు ప్రతినిధులు

అందాల పోటీలకు రూ.55 కోట్లా?

కవాడిగూడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అందాల పోటీలకు రూ.55 కోట్లా? అని, ఈ అందాల పోటీలను రద్దు చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ ప్రభుత్వం 73వ అందాల పోటీలకు (మిస్‌వరల్డ్ పోటీలు) హైదరాబాద్ వేదిక కావడం శోచనీయమని తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంగాంగ విన్యాసాల అందాల పోటీలకు రూ.55 కోట్లా? తెలంగాణ కళాకారులకు గాడిదగుడ్డా? అంశంపై సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ తిరునగరు స్వామి, మహేష్ దుర్గే, సి.పరమేశ్వరి, నరసయ్య, ఎం.వేణుగోపాల్, రాఘవేంద్ర, గోపి, కె.నిర్మల, రవీందర్‌గౌడ్, మురళీధర్ దేశ్‌పాండే తదితరులు మాట్లాడారు. ఈ అందాల పోటీలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ పోటీలను వ్యతిరేకిస్తూ నిరసన, ఆందోళనలో పాల్గొంటాం.. తస్మాత్ జాగ్రత్త అని వారు ప్రభుత్వాన్న హెచ్చరించారు.

● బబ్లూ కుటుంబానికి అండగా హీరో ప్రభాస్



నాగమయ్యకుంట బస్తీ నివాసి ప్రముఖ హీరో ప్రభాస్ అభిమాని అయిన బబ్లూ చిన్నవయసులో గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే ప్రభాస్ పీఏ రామకృష్ణ బబ్లూ కుటుంబాన్ని బుధవారం పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఆ కుటుంబానికి ఎప్పుడైనా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభాష్ అభిమాన సంఘం అధ్యక్షుడు పి.భాస్కర్, నాయకులు సతీష్, ప్రదీప్, మధు, సురేష్, శ్రీను, అనూష తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి.

గ్రామీణ అభ్యర్థులకు సివిల్స్‌లో మంచి ర్యాంకులు



62వ ర్యాంకర్ శ్రవణ్‌కుమార్‌తో తోట శరత్‌చంద్ర(ఫైల్)

చిక్కడపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు, మహిళా అభ్యర్థులకు సివిల్స్ -2024 తుది ఫలితాల్లో మంచి ర్యాంకులు వచ్చాయని అశోక్‌నగర్‌కు చెందిన శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర తెలిపారు. తమ అకాడమి విద్యార్థులు శ్రవణ్‌కుమార్‌కు 62వ ర్యాంకు, చైతన్యజాదవ్‌కు 68వర్యాంకు, చిన్నంరెడ్డికి 119వ ర్యాంకు, అలాగే మరెన్నో ర్యాంకులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది కూడా అనన్యరెడ్డికి మూడో ర్యాంకు, రుహానీకి ఐదో ర్యాంకు అలాగే మరెన్నో ర్యాంకులు వచ్చాయని తెలిపారు. తెలుగు విద్యార్థులు యూపీఎస్సీ సివిల్స్‌లో రాణించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.



సాయిచైతన్యజాదవ్‌ను అభినందిస్తున్న పోటీపరీక్షల నిపుణులు రాంబాబు

అశోక్‌నగర్‌లో సివిల్స్ ర్యాంకర్ల సందడి



263వ ర్యాంకర్ ప్రీతిని అభినందిస్తున్న సంఘమిత్ర

చిక్కడపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఫలితాలు విడుదల కావడంతో ర్యాంకులు సాధించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థుల రాకతో అశోక్‌నగర్ ప్రాంతంలో సందడి నెలకొంది. కోచింగ్ తీసుకున్న కోచింగ్ సెంటర్లకు వచ్చి చానళ్ళ, న్యూస్‌పేపర్లకు ఇంటర్వ్యూలు ఇవ్వడం, ర్యాంక్ సాధించిన వారు ఒకరినొకరు అభినందించుకోవడం, ఆయా కోచింగ్ సెంటర్ల డైరెక్టర్లను కలిసి వారితో ఫొటోలు దిగడం, వారి సన్మానాలు అందుకోవడం, వారి అభినందనలు, ఆశీర్వాదాలు పొందడం కనిపించింది. ముఖ్యంగా నగరంలోనే పేరెన్నికగన్న అశోక్‌నగర్‌లోని కోచింగ్ సెంటర్లు సందడిగా మారాయి. హెడ్‌కానిస్టేబుల్ కుమారుడు సాయిచైతన్యయాదవ్‌కు 68వ ర్యాంక్ రావడంతో ఆయనను పోటీపరీక్షల నిపుణులు రాంబాబు, 263 ర్యాంకర్ ప్రీతిని ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్ సంఘమిత్ర తదితరులు అభినందించారు.